"ఈ ఊళ్ళోనే వాళ్ళ కజిన్ సిస్టర్స్ వున్నారుట! వాళ్ళ దగ్గరకెళ్ళి నాకు చీరలు తెచ్చాడు. నువ్వు ఇప్పుడు మోహన్ గాడి ఇంటికెళ్ళి నా సూట్ కేస్ నవీన్ ఇంటికి తెచ్చి ఇవ్వు."

"అయితే నువ్వు నవీన్ ఇంటిలోనే ఉంటావా?" తెల్లబోయి చూస్తూ అన్నాడు.

"మరి ఇంకెక్కడ వుంటాను?"

"మా  అమ్మా నాన్నా ఊరెళ్లేదాకా ఏద్రైన్ హోటల్లో రూం తీసుకుని ఉంటేనో?"

"ఏం ఆ హోటల్ మేనేజర్‌తోనో, రిసెప్షనిస్టుతోనో  రేప్ చేయించుకోమంటావా? మీ వాళ్ళు వెళ్లేదాకా నేను నవీన్ దగ్గరే వుంటాను. అతన్ని ఆల్‌రెడీ అడిగాను అతనికేం అభ్యంతరం లేదుట!"

"అక్కర్లేదు నువ్వు నాతోనే వుండు" మొహం మాడ్చుకుంటూ అన్నాడు బుచ్చిబాబు .

"మరి మీ అమ్మా నాన్నా?"

"వాళ్ళని ఇప్పుడే ఊరికి పంపించేస్తాను!" బుచ్చిబాబు సిమెంట్ బెంచిమీంచి లేచి నిలబడ్డాడు.

0 0 0

రాత్రి ఎనిమిది గంటలకి......

విజయవాడ బస్టాండులో.....

హైదరాబాద్ వెళ్ళే బస్సులో పర్వతాలరావు, పార్వతమ్మ కూర్చుని ఉన్నారు. మరో అయిదు నిముషాల్లో బస్సు కదుల్తుంది.

బుచ్చిబాబు నేలమీద నిల్చుని  తల్లిదండ్రులతో మాట్లాడుతున్నాడు.

"ఏంటోరా బుచ్చీ ... మరోవారం పాటు నీతో గడపాలనుకున్నాం. నువ్వేమో అర్జంట్ క్యాంప్ కెళ్ళాలని అంటున్నావ్" అంది పార్వతమ్మ.

"అవునమ్మా....చాలా అర్జంటుగా విశాఖపట్నం వెళ్ళమన్నాడు మా మానేజర్. ఇప్పుడు మీ బస్సు కదలగానే నేను ఇంటికెళ్ళి సూట్‌కేసు సర్దుకుని మళ్ళీ  ఇక్కడికి పరిగెత్తుకురావాలి" చెప్పాడు బుచ్చిబాబు .

"అసలు ఇన్నిసార్లు తిరక్కుండా మాతోపాటే నువ్వు నీ సూట్‌కేసు తిసుకుని ఇక్కడికి వచ్చేస్తే సరిపోయి వుండేదికదరా  వెధవాయ్" అన్నాడు పర్వతాలరావు .

"నా బస్సు రాత్రి పదకొండు గంటలకుంది. ఇప్పుడే నేను సూట్‌కేసుతో వచ్చేస్తే సిల్లీగా వుంటుంది".

"పోనీ నువ్వు క్యాంప్ నుండి వచ్చేదాకా ఇక్కడే ఉందామంటే నువ్వార్కే కంగారుపెట్టి లాక్కొచ్చి బస్సెక్కించేసావ్" అంది పార్వతమ్మ .

"అదేంటమ్మా అలా అంటావ్ సిల్లీగా మీరిక్కడ ఉండడం నాకు మాత్రం ఇష్టంగా

ఉండదా? విశాఖపట్నంలో నా పని ఎన్ని రోజులకి అవుతుందో నాకే తెలీదు. నేను మళ్ళీ ఇంటికి రావడానికి వారం పట్టొచ్చు. రెండు వారాలు పట్టొచ్చు లేకపోతే ఏకంగా నెలరోజులే పట్టొచ్చు మరోసారి ఎప్పుడైనా రండి.''

బుచ్చిబాబు ఇలా అంటుండగా బస్సు ముందుకు కదిలింది.

``నీ ఆరోగ్యం జాగ్రత్తరా అబ్బాయ్!'' అరుస్తూ అంది కిటికీలోంచి చూస్తూ పార్వతమ్మ .

``అలాగే.''

బుచ్చిబాబు చెయ్యి ఊపుతూ ఇద్దరికీ టాటా చెప్పాడు.

బస్సు డిపోలోంచి బయటకు వచ్చి విజయవాడ మెయిన్ రోడ్డు మీద పరుగుతీసింది.

పార్వతమ్మ భర్త మొహంలోకి చూసింది. అతని భృకుటి ముడిపడి వుంది.

``ఏంటండీ ఆలోచిస్తున్నారు పాపం?'' అడిగింది ఆమె.

``మన వెధవాయ్ వ్యవహారం చూస్తుంటే ఏదో అనుమానంగా ఉంది. ఏదో గందరదోళం వుంది'' ఆలోచనగా అన్నాడు బుచ్చిబాబు .

0 0 0

బుచ్చిబాబు సీత బట్టలు సూట్‌కేసు తీసుకుని మోహన్ ఇంటిలోంచి బయటకు వరండాలోకి వచ్చాడు. అతనితోపాటు మోహన్, అతని భర్య రామలక్ష్మి కూడా బయటకు వచ్చారు.

మోహన్ మొహం మాడిపోయి వుంది.

``ఏంటోనండీ నేనేమో నిన్న సాయంత్రం హరికథా కాలక్షేపానికి వెళ్ళానా నేను తిరిగి వచ్చేసరికి ఆమె చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయింది'' అంది రామలక్ష్మి బుచ్చిబాబుతో.

``అయినా ఏం చెప్పి వెళ్తుందిలెండి. మీ ఆయన చెయ్యి పట్టుకుని లాగాడని చెబుతుందా? బలవంతం చేయబోయాడని చెబుతుందా?'' అనేసి వడివడిగా అడుగులు వేసుకుంటూ రోడ్డుమీదకి వచ్చేసాడు.

అక్కడ టాప్ వేసి వున్న ఒక రిక్షా ఆగి వుంది దాంట్లో సీత ఒదిగి కూర్చుని వుంది.

బుచ్చిబాబు సూట్‌కేస్‌తో సహా రిక్షా ఎక్కి పదవోయి అన్నాడు రిక్షా వాడితో.

రిక్షా ముందుకు కదిలింది.

``ఏమన్నాడు మీ క్లోజ్‌ఫ్రెండ్?'' వ్యంగ్యంగా అడిగింది సీత .

``అబ్బ....వాడ్ని నా క్లోజ్ ఫ్రెండ్ అని అనకు! వాడేమీ అనలేదు నేను మాత్రం వాళ్ళావిడ దగ్గర ఒక అగ్గిపుల్ల గీసేసివచ్చా'' కసిగా అన్నాడు బుచ్చిబాబు .

0 0 0

బుచ్చిబాబు సీతని దగ్గరకు తీసుకున్నాడు.

“అవడానికి రెండు రోజులే అయినా నీకు దూరంగా వుండి చాలా కాలం అయినట్టు వుంది” అన్నాడు.

“చాల్లే....నువ్వు ఇందుకే పనికొస్తావు” సీత బుచ్చిబాబు ఛాతీమీద చెయ్యేసి దూరంగా తోసింది.

“ఏంటో నీ బాధ?”

“బాధే మరి నిన్న రాత్రి సమయానికి నవీన్ స్కూటర్ మీద అటువైపు రాకపోతే నా గతి ఏమై వుండేదో?”

“ఏమీకాదు ఇది ఊరా అడవా? అయినా అతను నిన్ను రక్షించడానికి నీ కోసం అక్కడికి రాలేదుగా? అనుకోకుండా అవైపుకు వచ్చాడు నిన్ను స్కూటర్ మీద ఎక్కించుకున్నాడు. ఆ పని ఎవరైనా చేస్తారు?” మొహం మాడ్చుకుంటూ అన్నాడు బుచ్చిబాబు .

“నీ కెంత జెలసీనో?” నవ్వింది సీత .

“నాకా? ఎవరు చెప్పారు?” బుచ్చిబాబు ఉడుక్కున్నాడు.

“ఇంకెవరు చెప్పాలి? నీ మొహమే చెబుతోంది” ఈసారి పకపకా నవ్వింది సీత .

బుచ్చిబాబు బుంగమూతి పెట్టాడు.

సీత బుచ్చిబాబు నెత్తిన చిన్నగా మొట్టింది.

“పిచ్చి బుచ్చిబాబు ఎందుకలా ఫీలయిపోతావ్? ఆ నవీన్ ఇంటిలో ఒక్క రాత్రి గడిపాననేగా? అతను చాలా మంచివాడు తెలుసా?”

“నాకంటేనా?” అడిగాడు బుచ్చిబాబు .

“అందరినీ నీతో ఎందుకు కంపేర్ చేసుకుంటావు? పాపం జరిగింది విని చాలా బాధపడ్డాడు. ఆ మోహన్‌గాడి సంగతి చూస్తానన్నాడు. నేనే వద్దన్నా.”

“ఎందుకనో?”

“అతను కల్పించుకుంటే ఇది చాలా పెద్ద ఇష్యూ అవుతుంది. నేనే వాడి సంగతి చూస్తానని చెప్పాను. నవీన్ అస్సలు ఏమన్నాడో తెలుసా?”

“ఏమన్నాడు?” గుండె దడ దడ అంటుండగా అడిగాడు బుచ్చిబాబు .

“ఎందుకలా పెళ్ళి చేసుకోకుండా మీ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. మీరు నాకు బాగా నచ్చారు. మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని నేను పెళ్ళి చేసుకుంటానన్నాడు.”

బుచ్చిబాబు ఉలిక్కిపడ్డాడు.

“నువ్వేం అన్నావ్?” భయం భయంగా అడిగాడు.

“ఏం అనలేదు. నవ్వి ఊర్కున్నా”అంది సీత .

“నవ్వి వూరుకోడం ఏంటి? నాకిష్టంలేదని ఖచ్చితంగా చెప్పొచ్చుగా?” అరుస్తూ జుట్టు పీక్కున్నాడు బుచ్చిబాబు .

0 0 0

ఉదయం ఆరు గంటలయింది.

డోర్‌బెల్ మోగింది.

మంచం మీద వున్న బుచ్చిబాబు , సీత ఇద్దరూ ఒకేసారి కళ్ళు తెరిచారు.

“బహుశా పాలవాడు వచ్చాడేమో?” అన్నాడు బుచ్చిబాబు .

“ఈ టైములో వాడుకాక ఇంకెవరొస్తారు?” అంటూ మంచం దిగి ఆవులించుకుంటూ గదిలోంచి బయటకి వెళ్ళింది సీత.

బుచ్చిబాబు మంచం మీద అలాగే కళ్ళుమూస్కొని పడుకుని ఉన్నాడు. వీధి తలుపు గడియ తియ్యడం అతనికి వినిపించింది. అర నిమిషం గడిచింది. వీధి తలుపు చెక్కలూడేలా ధన్‌మని శబ్దం చేస్తూ వేసిన శబ్దం కూడా బుచ్చిబాబుకి వినిపించింది.

ఎవరొచ్చారబ్బా.... అంత విసురుగా అతలుపేసింది అనుకున్నాడు బుచ్చిబాబు .

మరో నిముషం గడిచింది.

సీత బెడ్‌రూంలోకి విసురుగా వచ్చి మంచం మీద బుచ్చిబాబు ప్రక్కన కూర్చుంది. అమె మొహంలో చికాకు కొట్టోచ్చినట్టు కనిపించింది బుచ్చిబాబుకి.

“ఏమైంది? ఎవరొచ్చారు?” అడిగాడు సీతని.

“పాలవాడె...” విసుగ్గా సమాధానం చెప్పింది.

“ఎందుకలా విసుక్కుంటున్నావ్...పాలు అయిపోయాయన్నాడా? తక్కువిచ్చాడా?”

సీత తల అడ్డంగా ఉపింది.

“వెధవ... పిచ్చివేషాలేస్తున్నాడు...పాల గిన్నెని చేయి తగిలిస్తూ అందించాడు.”

“అనుకోకుండా తగిలి ఉంటుంది లెద్దూ” సర్ది చెప్పాడు బుచ్చిబాబు .

“కావాలని చేశారో అనుకోకుండా చేశారో ఆడవాళ్ళకి తెలిసిపోతుంది.”

“అయినా నీతో వాడెందుకు మిస్ బిహేవ్ చేస్తాడు?”

“బహుశా మనిద్దరికీ పెళ్ళి కాలేదని వాడికి తెలిసిపోయి ఉంటుంది”

“హబ్బా......” మంచం కోడుకేసి తలకొట్టుకున్నాడు బుచ్చిబాబు .

మొహాలు కడుక్కున్నాక ఇద్దరూ వంట గదిలో కాఫీ త్రాగుతుండగా వీధిలోంచి ‘పేపర్’

అని కేక వినిపించింది.

సీత కాఫీ కప్పు వంటింటి గట్టుమీద పెట్టి బయటికెళ్ళింది. మరికొద్ది క్షణాల్లో చేతిలో న్యూస్ పేపర్‌తో వంటింటిలోకి విసుతుగా వచ్చి న్యూస్‌పేపర్ బుచ్చిబాబు మొహాన కొట్టింది.

"ఈవేళ నీకేమైంది?" విసుగ్గా అడిగాడు బుచ్చిబాబు .

"నాకేం కాలేదు, ఊళ్ళో వాళ్ళకే ఏదో అయింది. ఆ న్యూస్‌పేపర్‌వాడు పేపర్ ఇచ్చి కన్ను కొట్టి వెళ్ళిపోయాడు" ముక్కు పోగిస్తూ ఆవేశంగా అంది సీత .

"వాడికేం మాయదారి రోగం వచ్చింది?" అరుస్తూ అన్నాడు బుచ్చిబాబు .

"ఆ పాలవాడికి వచ్చిందే వీడికీ వచ్చింది."

"హబ్బా....!"

వంటింటి గట్టుకేసి బాధగా తల కొట్టుకున్నాడు బుచ్చిబాబు .

0 0 0

ఏకాంబరం ఫైల్లోంచి తలెత్తి సీత వంక చూసి "వెరీ గుడ్..... వెడీ వెరీ గుడ్. డ్రాఫ్టింగ్ చాలా బాగా చేశావ్" అన్నాడు.

"థాంక్యూ సార్" అంది సీత .

"నువ్వు బాగా నచ్చావ్ ... నువ్వో మాంచి టింగు టపోరి!"

"టింగు టపోరియా? అంతే ఏంటి సార్?"

"అంటే...అంటే...." ఏకాంబరం మొహం ఎర్రగా కంది పోయింది "ఇప్పుడు కాదులే సీతా! మనిద్దరి మధ్య మరికాస్త చనువు పెరిగాక నీకు చెప్తాను టింగు టపోరి అంతే ఏంటో" అన్నాడు సిగ్గుపడుతూ.

ఊహూ! వ్యవహారం ముదురుతోంది అని మనసులో అనుకుంది సీత. తనకి కావలసింది కూడా అదే.

"మీరు కూడా నాకు చాలా నచ్చారు సార్! మీరు చాలా మంచి జింగారి జింగు?" అంది సీత.

ఏకాంబరం ఉలిక్కిపడ్డాడు.

"ఏంటి ... నీది కూడా నా టైపు భాషేనా? వారెవ్వా! ఇంతకీ జింగారి జగు అంటే ఏంటి ?" కుతూహలంగా అడిగాడు.

"మనిద్దరి మధ్య చనువు పెరిగాకే నేను కూడా జింగారి జంగు అంటే ఏంటో మీకు చెప్తాను" సిగ్గుపడుతూ అంది సీత .

"అబ్బో! నువ్వు భలే గిలాకీ చిలకవే!"

"మీరు మాత్రం? భలే టింగు లింగుగారు కాదా?"

ఇద్దరూ ఒకేసారి ఫకాల్మని నవ్వారు.

అదే టైంలో బుచ్చిబాబు చేతిలో ఫైలు పట్టుకుని క్యాబిన్‌లోకి వచ్చాడు.

ఏకాంబరం మొహంలోని నవ్వు ఠకీమని మాయం అయిపోయింది.

"హూ!... ఏంటి గీనకంలో గిడకలా వచ్చావు?" కళ్ళెగరేస్తూ  బుచ్చిబాబు అడిగాడు.

"ఈ ఫైలు గురించి డిస్కస్ చెయ్యడానికి వచ్చాను సార్" మెల్లగా అన్నాడు బుచ్చిబాబు
. అతని మనసులో మాత్రం భగ్గున రగుల్తోంది. అప్పుడే ఆఫీసులో అందరూ చెవులు కొర్కుక్కోవడం మొదలుపెట్టారు, ఏకాంబరం పొద్దస్తమానం సీతని తన క్యాబిన్‌లోనే కూర్చోబెట్టుకుంటాడని!

"ఇప్పుడు కాదు, ఆ ఫైలు ఇక్కడ పెట్టి వెళ్ళు.. ప్రస్తుతం మే మిద్దరం చాలా సీరియస్ డిస్కషన్‌లో ఉన్నాం" అన్నాడు ఏకాంబరం బుచ్చిబాబు వంక కొర కొర చూస్తూ.

బుచ్చిబాబు సీత వంక చూశాడు. ఆమె మొహం ప్రక్కకి తిప్పి ఎటో చూస్తోంది.

"ఏంటి నేనేదో చెపుతుంటే కిల్లారికిత్తిగాడిలా ఆమె వైపుచూస్తావ్. ఆ ఫైలిక్కడ పెట్టి వెళ్లు" విసుక్కుంటూ అన్నాడు ఏకాంబరం.

"అలాగే సార్"

బుచ్చిబాబు ఫైలు అతని ముందు పెట్టేసి మనసులో ఏకాంబరాన్ని బండ బూతులు తిట్టుకుంటూ క్యాబిన్‌లోంచి బయటికెళ్ళిపోయాడు.

"బుచ్చిబాబుని ఇలా అన్నానని నీకేం కోపం రాలేదు కదా!" సీతని అడిగాడు ఏకాంబరం.

"అబ్బే... లేదండి సార్! మనం ఇలా మాట్లాడుతున్నప్పుడు అతనిలా చెప్పా పెట్టుకుండా మీ క్యాబిన్‌లోకి రావడమే తప్పు. అయినా మీరు మా బాస్......మమ్మల్ని అనే హక్కు మీకెప్పుడు ఉంది!" అంది సీత.

"వెరీ గుడ్.... డింగాలడిప్పి అంటే నువ్వే! నువ్వు ఈ ఆఫీసులో ఉండడం చాల అవసరం. హెడ్డాఫీసుకి స్ట్రాంగా రికమెండ్ చేసి నిన్ను ఇక్కడ పర్మనెంట్ చేయించేస్తా"

"కానీ ఇక్కడ పని చెయ్యడం చాలా కష్టం సార్!" అంది సీత.

"హయ్యో అలా అనకు. నీకు ఏరకమయిన ఫెసిలిటిస్ కావాలన్నా నేను ఎరేంజ్ చేస్తా" కంగారుపడుతూ అన్నాడు ఏకాంబరం .

"అబ్బే దాని గురించి కాదు సార్.... ఆ మోహన్ గాడితో వేగడం చాలా కష్టంగా ఉంది సార్".

ఏకాంబరం మొహం చిట్లించాడు.

"మోహన్‌గాడా? చెప్పు ఆ కిల్లారికిత్తిగాడు నిన్నేం అన్నాడు?"